రైతు డిస్కం పేరుతో
రైతులపై భారం మోపే కుట్ర

- చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామన్న హామీని కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని విమర్శ
- బీఆర్ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు

కరీంనగర్, జూన్ 20 (నినాదం):
ఎన్నికల సమ యంలో అన్ని పంటలను చివరి గింజ వరకు కొను గోలు చేసి బోనస్ చెల్లిస్తా మని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు కేంద్రం నిర్దేశించిన కోటా మేరకే కొనుగోళ్లు చేపడతామని ప్ర కటించడం ద్వారా రాష్ట్రం లోని రైతులను మోసం చేసిందని బీఆర్ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు విమర్శించారు.శనివారం రోజున మానకొండూరులోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాల నాయకులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు.అలాగే, 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరాను దెబ్బతీసే ఉద్దేశంతోనే ప్రభుత్వం రైతు డిస్కంను తెరపైకి తీసుకువచ్చిందని ఆరోపించారు. రైతుల ప్రయోజనాలకు విరుద్ధంగా తీసుకుంటున్న నిర్ణయాలను ప్రభుత్వం వెంటనే పునఃసమీక్షించాలని కోరారు.ఈ విలేకరుల సమావేశంలో కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, లింగంపల్లి శ్రీనివాస్ రెడ్డి, తాళ్లపల్లి శేఖర్ గౌడ్, లింగాల లక్ష్మణ్, గంప వెంకన్న, పాకాల మహిపాల్ రెడ్డి, గంట మహిపాల్, మాడుగుల రవీందర్ రెడ్డి, సతీష్ రెడ్డి, పార్నంది కిషన్, పిట్టల మధు, శాతరాజు యాదగిరి, రామంచ గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

బ్లూ బెల్స్ హైస్కూల్లో యోగా దినోత్సవం,

- రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం
- విద్యార్థుల్లో ఆరోగ్య చైతన్యం, ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంపు

కరీంనగర్, జూన్20(నినాదం):
కరీంనగర్‌లోని హనుమాన్‌నగర్ ప్రాంతంలోని బ్లూ బెల్స్ హైస్కూల్లో శనివారం రోజున అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగా ప్రదర్శనలు, రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐవైఎస్‌వో అవినీతి నిరోధక, రోడ్డు భద్రత విభాగం డైరెక్టర్ ఘనశ్యామ్ ఓజా ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ట్రాఫిక్ నియమాల పాటింపు, హెల్మెట్ వినియోగం, జీబ్రా క్రాసింగ్ ఉపయోగం, వాహనాలు నడిపేటప్పుడు మొబైల్ ఫోన్ వినియోగాన్ని నివారించడం వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, చిన్న వయసు నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. పాఠశాల కరస్పాండెంట్, చైర్మన్ జంగా సునీత మనోహర్ రెడ్డి మాట్లాడుతూ, యోగా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా ఏకాగ్రత, క్రమశిక్షణను పెంపొందిస్తుందని తెలిపారు. ప్రతి విద్యార్థి రోజువారీ జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు వివిధ యోగా ఆసనాలను ప్రదర్శించగా, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని యోగా, రోడ్డు భద్రత ప్రాముఖ్యతను తెలుసుకున్నారు. యోగా భారత దేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన వారసత్వమని, ఆరోగ్యకరమైన జీవనశైలికి అది దోహదపడుతుందని వక్తలు పేర్కొన్నారు.

విజయదశమి నాటికి కరీంనగర్, వరంగల్ జాతీయ రహదారి పూర్తి

- తదుపరి దశగా కరీంనగర్, జగిత్యాల రహదారి విస్తరణ పనులకు శ్రీకారం
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

కరీంనగర్, జూన్20(నినాదం):
కరీంనగర్, వరంగల్ జాతీయ రహదారి విస్తరణ పనులను ఈ ఏడాది విజయదశమి నాటికి పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. ప్రస్తుతం రహదారి పనుల్లో 90 శాతం పూర్తయ్యాయని అధికారులు వెల్లడించినట్లు ఆయన చెప్పారు. ఈ పనులు పూర్తికాగానే కరీంనగర్, జగిత్యాల రహదారి విస్తరణ పనులను ప్రారంభిస్తామని, ఇందుకు సంబంధించిన టెండర్ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని పేర్కొన్నారు.జమ్మికుంట నుంచి తిరిగి వస్తూ కందుగుల చౌరస్తా వద్ద మంత్రి జాతీయ రహదారి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ అధికారులు పనుల పురోగతిని వివరించారు. కొత్తగట్టు, బొమ్మకల్, గట్టుదుద్దెనపల్లి ప్రాంతాల్లో కొన్ని పనులు మినహా మిగిలిన భాగం పూర్తైందని, మరో మూడు నెలల్లో మొత్తం పనులు పూర్తి చేస్తామని తెలిపారు.అనంతరం మంత్రి మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారులతో పాటు గ్రామీణ, మండల, జిల్లా స్థాయి రహదారుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మెరుగైన రహదారులు రవాణా సౌకర్యాలను పెంచి ప్రాంతాల అభివృద్ధికి దోహదపడతాయని చెప్పారు. దేశవ్యాప్తంగా రహదారి నిర్మాణాల కోసం ఏటా సుమారు రూ.3 లక్షల కోట్లు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. కరీంనగర్--వరంగల్ రహదారి విస్తరణలో ఎదురైన న్యాయపరమైన సమస్యలను అధిగమిస్తూ పనులు వేగంగా కొనసాగుతున్నాయని ఆయన పేర్కొన్నారు.

ప్రైవేట్ విద్యాసంస్థలో పుస్తకాల విక్రయంపై ఎంఈఓకు ఫిర్యాదు:

జమ్మికుంట, జూన్ 20 (నినాదం):
జమ్మికుంట మండలం వావిలాల సెంటి మెరి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, స్కూల్ యూనిఫామ్ ను ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల యాజమాన్యమే నేరుగా విక్రయిస్తున్నట్లు భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం నాయకులు (బీఆర్ఎస్వి) కొమ్ము నరేష్, నల్లగాస హరీష్, చింతల కౌశిక్ ఆరోపించారు. సెంటిమెరి ఉన్నత పాఠశాల సమీపంలోని ఓ ఇంట్లో పాఠ్యపుస్తకాలను, స్కూల్ యూని ఫామ్, నోట్ బుక్స్ ను నిలువ ఉంచారని తమకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు శనివారం విద్యాశాఖ అధికారులకు సమాచారం అందించి పాఠశాల వద్దకు వెళ్లి పరిశీలించినట్లు విద్యార్థి సంఘం నాయకులు తెలిపారు. పాఠశాల నిర్వాహకులు ఒకసారి తామే విద్యార్థుల కోసం పాఠ్యపుస్తకాలను, నోట్ బుక్స్ ను తెప్పించామని చెప్పి మరోసారి మాట మార్చి తమకు సంబంధం లేదు. అవి ఏజెన్సీ వాళ్ళు తెప్పించుకొని విక్రయిస్తున్నారని పొంతన లేని సమాధానం చెప్పారని అన్నారు. విషయాన్ని మండల విద్యాధికారి తో పాటు జిల్లా విద్యాశాఖ అధికారికి తెలపగా జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు పాఠశాలకు చేరుకున్న మండల విద్యాధికారిని తమతో పాటు పాఠశాల నిర్వాహకులతో మాట్లాడి పలు వివరాలను సేకరించడం జరిగిందన్నారు. మార్కెట్‌లో తక్కువ ధరలకు లభించే పుస్తకాలను, నోట్ బుక్స్, స్కూల్ యూనిఫామ్ ను విద్యాసంస్థలో అధిక ధరలకు విక్రయిస్తున్నారని విద్యార్థి సంఘం నాయకులు ఆరోపించారు. విద్యాసంస్థలు విద్యా బోధనకే పరిమితం కావాలని, పుస్తకాల విక్రయాలను వ్యాపారంగా మార్చడం సరికాదని అన్నారు. పాఠశాల నిర్వాహకులే పుస్తకాలను, నోట్ బుక్స్, యూనిఫామ్స్ ను విక్రయించడం వల్ల తల్లిదండ్రులపై అదనపు ఆర్థిక భారం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై సంబంధిత విద్యాశాఖ అధికారులు వెంటనే విచారణ జరిపి, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.లిలిలిపుస్తకాలు నిల్వ ఉంచిన గదికి తాళం వేసిన మండల విద్యాధికారిని...విద్యార్థి సంఘం నాయకులు అందించిన సమాచారం మేరకు పాఠశాలకు చేరుకున్న మండల విద్యాధికారిని హేమలత పాఠశాల నిర్వాహకుల నుండి పలు వివరాలను సేకరించారు. పాఠశాల సమీపంలోని ఓ ఇంటి గదిలో పాఠ్యపుస్తకాలను, నోట్ బుక్స్ ను నిలువ ఉంచిన విషయం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారిని హేమలత మాట్లాడుతూ... రెండు రోజులలో పుస్తకాల నిలువపై పూర్తిస్థాయిలో విచారణ జరుపుతామని అన్నారు. పాఠశాల యాజమాన్యానికి ఇట్టి విషయంపై నోటీసు సైతం జారీ చేయునట్లు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యం, పుస్తకాలను విక్రయించే ఏజెన్సీ వారి నుండి పూర్తి సమాచారం సేకరించిన తర్వాత తగు చర్యలు తీసుకుంటామని అన్నారు. అప్పటి వరకు పుస్తకాలు, నోట్ బుక్స్ ను నిలువ ఉంచిన గదికి తాళం వేస్తున్నట్లు తెలిపారు.

వాసవీ వనిత క్లబ్ ఆధ్వర్యంలో డాన్ టు డాస్క్ కార్యక్రమాలు

- నిస్వార్థ సేవ వాసవి వనిత క్లబ్ లక్ష్యం
- వనిత క్లబ్ అధ్యక్షురాలు అయిత శ్రీలత

జమ్మికుంట, జూన్ 20 (నినాదం)
వాసవి వనిత క్లబ్ ఇంటర్నేషనల్ సేవా కార్యక్రమంలో భాగంగా వాసవి వనిత క్లబ్ జమ్మికుంట వారు నిర్వహించిన "డాన్ టు డాస్క్" సేవలను శనివారం ఘనంగా నిర్వహించారు. వాసవి వనిత క్లబ్ జమ్మికుంట అధ్యక్షురాలు అయిత శ్రీలత ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సేవా కార్యక్రమాలలో భాగంగా స్థానిక లలిత అమ్మవారి దేవాలయంలో సిమెంట్ బెంచ్ ఏర్పాటు చేయడం జరిగింది. స్థానిక అయ్యప్ప స్వామి దేవాలయంలో సిమెంట్ తొట్టి ఏర్పాటు చేసి గోవులకు గ్రాసం అందించడం జరిగింది. మానసిక దివ్యాంగుల పాఠశాలలో ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌తో పాటు పిల్లలకు కావలసిన సరుకులు అందించడం జరిగింది. బాలికల పాఠశాలలో ప్రతిభావంతులైన విద్యార్థుల ను ప్రోత్సహించడానికి వారికి శాలువాలను బహుకరించారు.ఈ కార్యక్రమానికి వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు అయిత శ్రీలత, ప్రధాన కార్యదర్శి సి.హెచ్. జ్యోతి, ఆర్థిక కార్యదర్శి మద్ది సురేఖ ముఖ్య అతిథిగా గోల్డెన్ స్టార్ పిప్పాల విశ్వేశ్వరరావు, ఇంటర్నేషనల్ అడ్మినిస్ట్రేషన్ వైస్ ప్రెసిడెంట్, మల్టిపుల్ అబ్జర్వర్‌గా ఐ.పి.సి. కె.సి.జి.ఎఫ్. గంప సురేందర్, రీజియన్ చైర్ పర్సన్ రామిని శ్రీనివాస్, జోన్ చైర్ పర్సన్ స్వామిశెట్టి అఖిలాండేశ్వరి, జోన్ చైర్ పర్సన్ అయితు రమేష్, వైస్ గవర్నర్ తంగళ్లపల్లి రాజాభాస్కర్, గో సేవ కోఆర్డినేటర్ రావికంటి నీలకంఠం, లంకలపల్లి శరత్, జిల్లా అధికారులు వ్యాసాన్ని రమేష్, అయిత సుధాకర్ మరియు వాసవి వనిత క్లబ్ సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

చైర్మన్ చొరవతోనే చేనేత సంఘం ఎన్నిక ఏకగ్రీవం..

- చేనేత సంఘం అధ్యక్షుడిగా ఉడుత రమేష్
- మున్సిపల్ చైర్మన్ ను సన్మానించిన చేనేత సంఘం నాయకులు

జమ్మికుంట, జూన్ 20 (నినాదం) :
జమ్మికుంట చేనేత సంఘం ఎన్నికలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడానికి చైర్మన్ ప్రశాంత్ కుమార్ చేసిన కృషి అభినందనీయమని ఆయన చొరవతోనే ఎన్నిక ఏకగ్రీవం అయిందని చేనేత సంఘం నూతన అధ్యక్షుడు ఉడుత రమేష్ తెలిపారు. శనివారం తన కార్యవర్గాన్ని తీసుకొని మున్సిపల్ చైర్మన్ కార్యాలయంలో చైర్మన్ ప్రశాంత్ కుమార్ ను శాలువాతో సన్మానించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేనేత సంఘం ఎన్నికలకు గాను పలువురు నామినేషన్లు వేయగా మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ ఆధ్వర్యంలో ఎన్నికలు లేకుండా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ ప్రశాంత్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపి వారిని సన్మానించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చేనేత సంఘం అధ్యక్షులు ఉడుత రమేష్ ఉపాధ్యక్షులు దాసరి రాజేందర్, కోశాధికారి అడిచర్ల మల్లయ్య, డైరెక్టర్లుగా ఎలిగేటి దామోదర్, తాటిపాముల రాజమౌళి, గుండేటి శీను, సందుపట్ల రాజమౌళి, బూర్ల సంధ్య, దుస్సా సరోజన గార్లు వారిని అభినందించి శుభాకాంక్షలు తెలిపిన మున్సిపల్ చైర్మన్ గారు ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ చుంచూ రమాదేవి, నాగపూరి శ్రీనివాస్,శివ చేనేత సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు...

అక్రమ ఇసుక రవాణా పై పోలీసుల స్పెషల్ డ్రైవ్

- అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం
- జమ్మికుంట రూరల్ సిఐ పులి వెంకట్

జమ్మికుంట, జూన్ 20 (నినాదం):
వీణవంక మండల పరిధిలోని పలు గ్రామాలలో అక్రమ ఇసుక అక్రమ రవాణాపై జమ్మికుంట రూరల్ సీఐ పులి వెంకట్ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు.అక్రమ ఇసుక రవాణా విషయంలో కరీంనగర్ సిపి గౌస్ ఆలం ఆదేశాల మేరకు జమ్మికుంట రూరల్ సీఐ పులి వెంకట్ ఆధ్వర్యంలో ఎస్సై ఆవుల తిరుపతి పోలీస్ సిబ్బంది వీణవంక మండల కేంద్రంలో స్పెషల్ డ్రైవ్ ను నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమతి లేని ట్రాక్టర్లను ,నెంబర్ ప్లేట్ లేకుండా ఉన్న ట్రాక్టర్ల పై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీఐ వెంకట్ మాట్లాడుతూ మానేరు వాగు పరిసర ప్రాంతాల నుండి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ ఇసుక రవాణాలను చేసినట్లయితే కఠినచర్యలుతీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా చల్లూరు గ్రామ పరిధిలో గల పాఠశాలలకు 100 మీటర్ల దూరంలో ఉన్న పాన్ షాపులను కిరాణం షాపులను ఎస్సై ఆవుల తిరుపతి ఆధ్వర్యంలో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. పాన్ షాపులలో అక్రమంగా నిలువచేసిన ఆరు కిలోల తంబాకు ప్రోడక్ట్ పట్టుకొని ఎండి మస్టర్, జిలాని, మసిరోద్దీన్ లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. తంబాకు వాడడం వల్ల తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఏర్పడతాయని వాటికి ప్రజలందరూ దూరంగా ఉండాలని పాఠశాల ఆవరణంలో ఎవరైనా ఇలాంటి మత్తు పదార్థాలకు సంబంధించినటువంటి వాడినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పారమిత స్కూల్‌లో తండ్రుల దినోత్సవం, అంతర్జాతీయ సంగీత దినోత్సవ వేడుకలు

-తండ్రి పాత్ర గొప్పదనం, సంగీతం ప్రాముఖ్యతను చాటిన ప్రత్యేక కార్యక్రమాలు

కరీంనగర్, జూన్20(నినాదం):
స్థానిక పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాలలో తండ్రుల దినోత్సవం, అంతర్జాతీయ సంగీత దినోత్సవాన్ని పురస్కరించుకుని ముందస్తు వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ హన్మంతరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.వేడుకల సందర్భంగా తండ్రుల కోసం వినోదాత్మక ఆటలు, సరదా పోటీలు, కుటుంబ బంధాలను బలోపేతం చేసే ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో పాల్గొన్న తండ్రులు తమ పిల్లలతో కలిసి ఆనందంగా గడిపారు. క్రీడా పోటీల్లో విజేతలైన తండ్రులకు హన్మంతరావు బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ డాక్టర్ ఈ. ప్రసాదరావు మాట్లాడుతూ, తండ్రి కుటుంబానికి బలమైన ఆధారం అని, పిల్లల ఎదుగుదలలో ఆయన పాత్ర అమూల్యమని పేర్కొన్నారు. అలాగే సంగీతం వ్యక్తిత్వ వికాసానికి, మానసిక ప్రశాంతతకు ఎంతో దోహదపడుతుందని తెలిపారు.పాఠశాల డైరెక్టర్లు ప్రసూన, అనూకర్‌రావు, రష్మిత, వినోద్‌రావు, వియుయం. ప్రసాద్, హన్మంత రావు, ప్రధానోపాధ్యాయులు గోపీకృష్ణ, సమన్వయకర్తలు రబీంద్ర పాత్రో, భవానీ, నిఖిత, సంగీత ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సూర్యోదయం, సూర్యాస్తమయం సేవా కార్యక్రమాలు విజయవంతం
పరిశీలకుల ప్రశంసలు

-విద్య, వైద్యం, గోసేవ, సామాజిక సేవలకు ప్రాధాన్యం

కరీంనగర్, జూన్20(నినాదం):
వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వార్షిక కార్యాచరణలో భాగంగా వాసవి క్లబ్ ఎంఆర్. కరీంనగర్ ఆధ్వర్యంలో శనివారం రోజున నిర్వహించిన సూర్యోదయం నుండి సూర్యాస్తమయం వరకు సేవా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి.కరీంనగర్‌లోని కోతి రాంపూర్ గిద్దె పెరుమాళ్ల స్వామి దేవాలయంలో విశిష్ట అతిథులు వి.ఎన్.ఎం. ఉపేందర్ , వి.ఎన్. జైన అర్చన రాజ్ పూలమాలలు, పుష్పగుచ్ఛాలు, కోలాటాలతో స్వాగతం పలికి, దైవ దర్శనం చేయించారు.అనంతరం పరిశీలకులుగా పాల్గొన్న వారు క్లబ్ చేపట్టిన వివిధ సేవా కార్యక్రమాలను పరిశీలించారు. ముఖ్యంగా పట్టణంలోని ప్రధాన కూడళ్లలో అత్యవసర సేవలు, రక్తదాతల సంప్రదింపు వివరాలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం, గోశాలలో గోవులకు మేత అందించడం, గిద్దె పెరుమాళ్ల దేవాలయానికి సిమెంట్ బెంచ్ అందజేయడం, వాసవి వృద్ధాశ్రమానికి వైద్య కిట్ అందించడం, కోతి రాంపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 15 మంది ప్రతిభావంతులైన విద్యార్థులను సత్కరించి నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ చేయడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు.అలాగే వాసవి క్లబ్ ఇంటర్నేషనల్‌కు మూడు కేజీఎఫ్‌లు, మూడు మధ్యంతర సమావేశ రుసుములు సమర్పించడం, ఐదుగురు నూతన సభ్యులను చేర్చడం, ఐదుగురు విశిష్ట స్వచ్ఛంద సేవకుల పేర్లను ఎంపిక చేసి పంపించడం జరిగింది.క్లబ్ సభ్యులను మరింత సేవా కార్యక్రమాల వైపు ప్రోత్సహించారు.ఈ కార్యక్రమానికి సహకరించిన ప్రాంతీయ చైర్‌పర్సన్ రాచమల్ల గాయత్రి , మండల చైర్‌పర్సన్ కాసనగొట్టు వజ్రలక్ష్మి కి క్లబ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది.క్లబ్ అధ్యక్షుడు చిట్టిమల్ల సత్యనారాయణ , కోశాధికారి పైడ రవి , పూర్వాధ్యక్షులు కామని తిరుమలేష్ గుప్తా , శ్రీ యాంసాని అశోక్ ఇతర సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రైతాంగానికి కాంగ్రెస్ సర్కార్ వెన్నుపోటు

-మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ ధ్వజం
-కేంద్రం కోటా వరకే కొంటామనడం రైతుల పాలిట మరణశాసనం!
-పదేళ్ల 'పండుగలాంటి వ్యవసాయాన్ని' మళ్లీ సంక్షోభంలోకి నెట్టిన సీఎం రేవంత్ రెడ్డి.
-ప్రతి గింజా కొనకపోతే రైతుల పక్షాన బీఆర్ఎస్ ఆధ్వర్యంలో 'జంగ్ సైరన్' ఖాయం.

హుస్నాబాద్, జూన్ 20 (నినాదం):-
దేశానికే వెన్నుముకగా నిలిచిన తెలంగాణ రైతాంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం దారుణంగా వెన్నుపోటు పొడిచిందని హుస్నాబాద్ మాజీ శాసనసభ్యులు సతీష్ కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం హుస్నాబాద్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వరాష్ట్రంలో 'అన్నపూర్ణ'గా ఎదిగిన తెలంగాణలో నేడు అన్నదాతలను అనాథలుగా మార్చే దుర్మార్గానికి ఈ ప్రభుత్వం తెగబడిందని మండిపడ్డారు. కేంద్రం చెప్పిన కోటా వరకే పంటలు కొంటాం తప్ప, రాష్ట్ర ప్రభుత్వం అదనంగా ఒక్క గింజ కూడా కొనబోదని చెప్పడం రైతుల పాలిట మరణశాసనమేనని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.సమైక్య పాలన నాటి కష్టాల్లోకి తెలంగాణ వ్యవసాయంముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన తుగ్లక్ నిర్ణయాలతో వ్యవసాయాన్ని ఇప్పటికే తీవ్ర సంక్షోభంలోకి నెట్టి రైతు బతుకును ఛిద్రం చేశారని సతీష్ కుమార్ విమర్శించారు. కేసీఆర్‌పదేళ్ల పాలనలో ధీమాగా, ధైర్యంగా బతికిన రైతును మళ్లీ సమైక్యరాష్ట్రం నాటి కష్టాల్లోకి నెట్టేశారని ధ్వజమెత్తారు. అరవై ఏళ్ల సమైక్య పాలనలో కరెంట్ లేక, కాలిపోయే మోటర్లు, పేలిపోయే ట్రాన్స్‌ఫార్మర్లతో తెలంగాణ వ్యవసాయం కన్నీటి సేద్యంగా మారిందని.. దేశంలోనే అత్యధిక రైతు ఆత్మహత్యలతో తల్లడిల్లిన ఆనాటి పరిస్థితులను కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ పునరావృతం చేస్తోందని ఆరోపిం చారు. రైతు సంక్షేమానికి కేసీఆర్ స్వర్ణయుగం రైతుల కష్టాలు, కన్నీళ్లే పునాదిగా సాగిన తెలంగాణ ఉద్యమ నినాదమైన 'నీళ్లు, నిధులు, నియామకాలు' అనే అంశాన్ని కేసీఆర్ గారు తొలి ప్రభుత్వ విధానంగా మార్చారని సతీష్ కుమార్ గుర్తుచేశారు. మిషన్ కాకతీయ ద్వారా 45 వేల చెరువుల పూడిక తీసి భూగర్భ జలాలను పెంచారని, కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా 45 లక్షల ఎకరాలకు, పాలమూరు-రంగారెడ్డి ద్వారా దక్షిణ తెలంగాణకు సాగునీరు అందించారని తెలిపారు. దేశ చరిత్రలోనే ఎవరూ ఊహించని విధంగా 'రైతుబంధు' కింద 11 విడతల్లో రూ. 72,000 కోట్లు నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేశారని, రైతుబీమా ద్వారా రూ. 5 లక్షల ధీమా కల్పించారని పేర్కొన్నారు. రైతుబంధు, రుణమాఫీ, రైతుబీమా కలుపుకుని లక్ష కోట్లకు పైగా నిధులు రైతుల ఖాతాల్లో వేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనన్నారు.ఫుడ్ బౌల్ ఆఫ్ ఇండియాను రోడ్డున పడేశారు!24 గంటల ఉచిత విద్యుత్ మరియు రైతు కేంద్రీకృత పాలన వల్ల తెలంగాణలో వ్యవసాయ విప్లవం వచ్చిందని, 2014లో 1.31 కోట్ల ఎకరాలుగా ఉన్న సాగు విస్తీర్ణం 2023 నాటికి 2.30 కోట్ల ఎకరాలకు చేరి తెలంగాణ దేశానికే 'ఫుడ్ బౌల్ ఆఫ్ ఇండియా'గా మారిందని స్పష్టం చేశారు. పంజాబ్‌ను తలదన్ని వరి పండించిన రాష్ట్రంగా నిలిపామన్నారు. కష్టకాలంలోనూ కేసీఆర్ గారు 7 వేల కొనుగోలు కేంద్రాలు పెట్టి ప్రతి గింజనూ మద్దతు ధరకు కొన్నారని.. కేవలం వడ్లే కాకుండా మొక్కజొన్న, జొన్న, శనగ, కందులు, పెసలు, సన్‌ఫ్లవర్, సోయాబీన్ కూడా కొనుగోలు చేసి కొండంత అండగా నిలిచారని గుర్తు చేశారు. అబద్ధపు హామీలతో రేవంత్ రెడ్డి దగా అలాంటి పండుగలాంటి వ్యవసాయాన్ని రేవంత్ రెడ్డి రెండున్నర ఏళ్లలోనే దండుగలా మార్చే కుట్ర చేస్తున్నారని సతీష్ కుమార్ మండిపడ్డారు. రైతుబంధు రూ. 15 వేలకు పెంచుతామని చెప్పి మూడుసార్లు ఎగొట్టారని, రైతు డిస్కంల పేరుతో ఉచిత విద్యుత్‌కు ఉరి వేస్తున్నారని, రైతుబీమా ప్రీమియం చెల్లించక 7600 కుటుంబాలకు మొండిచేయి చూపారని విమర్శించారు. పదేళ్లలో లేని యూరియా కొరతను సృష్టించి, పంట కొనకుండా 60 రోజుల పాటు రైతులను వేధించడం వల్లే కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ప్రాణాలు కోల్పోతున్నారని, ప్రభుత్వ అసమర్థత వల్లే ఇప్పటికే వెయ్యి మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ఆరోపించారు.కేంద్రంతో లోపాయికారీ ఒప్పందాలు..ఎన్నికల సమయంలో ప్రతి పంటను కొని రూ. 500 బోనస్ ఇస్తామని అబద్ధపు హామీలిచ్చిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు ఎందుకు చేతులెత్తేస్తున్నారని ప్రశ్నించారు. "2021లో రైతు దీక్షలో పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు 'రూ. 10 వేల కోట్లు ఇస్తే అన్ని పంటలు కొని చూపిస్తా' అన్న రేవంత్ రెడ్డికి, ఇప్పుడు ముఖ్యమంత్రి అయ్యాక ఆ పదివేల కోట్లు లేవా?అన్నారు.